క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమంలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

19 నుంచి మహిళా చైతన్య సదస్సు

తవణంపల్లె: మండలంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పత్రీజీ మహిళా చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కార్యదర్శి రాధిక తెలిపారు. బ్రహ్మర్షి పత్రీజీ దివ్య స్ఫూర్తి, ప్రతి అమ్మ మార్గదర్శకంలో జరుగుతుందని వివరించారు. పత్రీజీ ఆశయాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడానికే ఈ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మహిళా ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వరసిద్ధుని సన్నిధిలో డీజీపీ



డీజీపీకి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం డీజీపీ ద్వారక తిరుమలరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అనంతపురం రేంజ్ డీఐజీ షీముషి, జిల్లా ఎస్పీ మణికంఠచందోలు, ఏఎస్పీలు, డీఎస్పీలు, ఆలయ అధికారులు, వేద పండితులు ఘనస్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. మూలస్థానంలోని స్వామి వారి విశిష్టతను, చరిత్రను అర్చకులు ఆయనకు వివరించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి ప్రసాదం, చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీ మహబూబ్‌బాషా, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్, సీఐ రవిశంకర్, ఎస్ఐ రామ్మోహన్, ఏఈఓ క్రిష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి ఉన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



డీసీఓ పద్మజను సత్కరిస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: గురుకుల పాఠశాలల్లో ఎంతో విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన పద్మజ చిత్తూరు, తిరుపతి జిల్లా గురుకుల పాఠశాలల కో ఆర్డినేటర్‌గా రావడం ఆనందకరమని దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మునస్వామి అన్నారు. ఆ సంఘం నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీసీఓ పద్మజను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా నూతన డీసీఓ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అనంతరం ఆ సంఘం నాయకులు డీసీఓను సత్కరించారు. నాయకులు ధనంజయరావు, పార్థసారధి, కుమార్, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

'లక్కా గృహ దహనం'

కార్వేటినగరం: ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీవెంకటేశ్వర నాటక కళా మండలి వారు ప్రదర్శించిన లక్కాగృహ దహనం నాటిక ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం లక్కాగృహ దహనం ఘట్టాన్ని భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా కాలక్షేపంలో విపులంగా వివరించారు.

ఖరీఫ్ ప్రారంభమై మాసం దాటింది.. ఇప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మిగిలింది.. ఏటా సీజన్‌కు ముందే రూ.20వేలు అందిస్తామన్న చంద్రబాబు హామీ నీటి మీద రాతగా మారిపోయింది.. అధికారంలోకి వచ్చేందుకు హామీలు ఇవ్వడంలో ఉన్న శ్రద్ధ.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఉండదని మరోమారు రుజువవుతోంది.. సేద్యం పనులు మొదలెట్టేందుకు చేయూత కోసం రైతాంగం ఆశగా ఎదురుచూస్తూనే ఉంది.. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తోంది.. అన్నదాతను సకాలంలో ఆదుకోకుండా కాలయాపన చేస్తోంది.. పథకం అమలుపై కనీసం స్పష్టత కూడా ఇవ్వకుండా అయోమయానికి గురి చేస్తోంది.

జీడీ నెల్లూరు మండలంలో ఓ రైతు అప్పు చేసి సాగు చేస్తున్న వరి పంట



సాగుకు అందని భరోసా

- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ చేసిన కేంద్రం
- ఏటా రూ.20వేలు అందిస్తామన్న హామీని అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- అన్నదాతల అవస్థలను ఖాతరు చేయని వైనం
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతాంగం



వరి నాట్లకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

పాలసముద్రం : వ్యవసాయానికి అండగా నిలుస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద సకాలంలో పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించేది.

అయితే ఏటా రూ.20వేలు ఇస్తామని హామీలు గుప్పించిన చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు పూర్తయినా ఇప్పటికీ పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పష్టం ఇవ్వలేదు. కేవలం రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అని మార్చడం తప్ప చేసింది ఏమీ లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా.. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం కింద తొలి విడత నగదు రూ.2వేలను రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేసేసింది.

అన్నదాతకు అప్పులే గతి..!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా పథకం నిధులను అన్నదాతలకు అందించేది. ఈ ఏడాది కూడా మేలోనే రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన పీఎం కిసాన్ నగదు రైతులకు దుక్కులకు ఉపయోగపడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు వాడుకోవాల్సి ఉంటుంది. కానీ, కూటమి సర్కారు స్పందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

నాడు ఆరంభంలోనే..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసేది. పెట్టుబడికి అన్నదాతలు ఏమాత్రం ఇబ్బంది పడకూడదని చిత్తశుద్ధితో సాయం అందించేది. పీఎం కిసాన్ కింద రూ.6వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతలు అన్నదాతల ఖాతాల్లో సీజన్ ఆరంభంలోనే జమ చేసేది. ఒక్క గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోనే సుమారు 43,480 మంది రైతులకు ఏడాదికి రూ.51.69 కోట్లు పంపిణీ చేసేది.

పంట రుణాలకు పాట్లు!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. దీంతో సేద్యం పనుల కోసం రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం మార్చడంలో చూపిన తొందరలో రాష్ట్ర ప్రభుత్వం సగమైనా రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో చూపించి ఉంటే సాగు సంబరంగా ఉండేది.

> **ఇబ్బంది లేకుండా చూడాలి**
>
> 
>
> నాకు మూడు ఎకరాల భూమి ఉంది. మొదట వేరుశనగ సాగు చేశాం. విత్తనాలు మొలకెత్తక పోవడంతో మళ్లీ వరి, చెరుకు వేసుకున్నాం. సాగు ఖర్చులు పెరిగాయి. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఉచిత పంట బీమాను అమలు చేసేది. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రైతులకు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలి.
>
> – రవిరెడ్డి, రైతు, కృష్ణజమ్మాపురం
>
> **అప్పు చేయాల్సి వచ్చింది**
>
> 
>
> నాకు ఎకరా భూమి ఉంది. పంటల సాగుకు పెట్టుబడిగా రూ.15వేలు అవసరం. గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల కింద ఒకేసారి డబ్బులు ఇచ్చేవారు. దాంతో పెట్టుబడికి వెతుక్కోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అప్పు చేసి పంట సాగు ప్రారంభిస్తున్నాం. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని ఈసారైనా చంద్రబాబు నిలబెట్టుకుంటే బాగుంటుంది. సకాలంలో ఇస్తేనే మాకు మంచి జరుగుతుంది.
>
> – శేఖర్‌రాజు, రైతు, తొట్టికండ్రిగ

మా ఊరి పేరు ఇది కాదయ్యో!





పల్లూరుకి బదులు పల్లురు అని, పానాటూరుకు బదులు పానటూరు అని ఉన్న బోర్డులు

గుడిపాల: గ్రామాల పేర్లు రాయడంలో కూడా తప్పులు దొర్లాయి. చిత్తూరు-వేలూరు రహదారిపై రోడ్డు కొంతభాగం దెబ్బతింది. నూతనంగా తారురోడ్డు వేశారు. రోడ్డు పక్కలో ఉన్న కొన్ని గ్రామాలకు బోర్డులను ఆర్అండ్‌బి అధికారులు ఇటీవల అమర్చారు. అయితే ఈ బోర్డులపై ఊర్ల పేర్లలో అక్షరదోషాలు దొర్లాయి. పల్లూరు గ్రామానికి బదులు పలూరు అని, పానాటూరు గ్రామానికి బదులు పానటూరు అని, అనుపు గ్రామానికి అనుపురు అని ఆర్అండ్‌బి అధికారులు బోర్డులు పెట్టారు. కొందరు వాహనదారులు దీన్ని చూసి అయోమయానికి గురవుతున్నారు. మరి కొందరు అధికారులే ఇలా తప్పులు రాయడం ఏంటని నవ్వుకుంటున్నారు. కానీ ఆ బోర్డులను సరిచేసే అవకాశమున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



అనుపు గ్రామానికి బదులు అనుపురు అని రాసి ఉన్న బోర్డు

గాండ్ల కుల సంక్షేమమే ఏకైక లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్: గాండ్ల కుల ఐక్యత, సంక్షేమమే ఏకైక లక్ష్యమని అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ అన్నారు. ఆ సంఘం నాయకులు ఆదివారం నగరంలోని జైహింద్ పాఠశాలలో జిల్లా సర్వసభ్య, కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గాండ్ల ఉద్యోగులు సమైక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా వెంకటరమణ, అధ్యక్షునిగా ఏఆర్‌కుమార్, కార్యదర్శిగా మోహన్ శెట్టి, కోశాధికారిగా బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా జగదీష్, ఏకాంబరం, జిల్లా మహిళా కార్యదర్శిగా సుజాత, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో సంఘం బలోపేతం కు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ

హామీలు అమలు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: అధికారంలో రావడానికి ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని చిత్తూరు డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంపద సృష్టిస్తాం.. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిందన్నారు. పింఛన్ మినహాయించి మరే పథకం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నెల రోజులవుతున్నా పథకాలపై ఇంకా ఎందుకు స్పష్టత ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి మాజీ చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాయత్రీదేవి. నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, మాజీ టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్ మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

నారాయణవనం: టీటీడీకి అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉదయం నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తిచేసిన అర్చకులు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. గంగాళంలోని జలంలో త్రిశూల స్నానం చేయించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలు, నైవేద్య సమర్పణ అనంతరం ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అవరోహణం చేయించారు. ఉత్సవాలను నిర్వహించిన అర్చకులను బహుమానంతో సత్కరించారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జిత అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు.

తూకం.. మోసం





గ్రామాల్లోని దుకాణాల్లో వినియోగిస్తున్న పాత కాటాలు, తూనిక రాళ్లు

- తనిఖీ మరిచిన అధికారులు
- నష్టపోతున్న వినియోగదారులు

గుడిపాల: ఎలక్ట్రానిక్ కాటాలు, కంప్యూటరైజ్డ్ తూనికలు తప్పనిసరిగా వినియోగించాలన్న నిబంధనలు ఉన్నా పలు దుకాణాల్లో తూనిక రాళ్లతో మోసం చేస్తున్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటికీ సంప్రదాయ కాటాలనే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాలను ఉపయోగించాలి. కానీ రాళ్లను కేజీ లెక్క చూపించి తూకాలు నిర్వహిస్తూ వినియోగదారులను ముంచేస్తున్నారు. తూనిక రాళ్లను ప్రతి రెండేళ్లకు ఓసారి తూనికలు, కొలతల విభాగం వారిచే సరిచేయించి ముద్ర వేయించుకోవాలి. ఇది మండలంలో ఎక్కడా జరగడం లేదు. అధికారులకు మామూళ్లు అందడమో లేక నిర్లక్ష్యమో తెలియదు కానీ నిబంధనలు మాత్రం అమలుకు నోచుకోలేదు. గ్రామాల్లో ఆయా సీజన్‌ల బట్టి దుకాణాల్లో వ్యాపారం జరుగుతుంది. అంతేగాకుండా కూరగాయలు, పండ్లు తదితర వ్యాపారాలు ద్విచక్ర వాహనాలు, రోడ్లకు ఇరుపక్కలా బండ్లపైన అధికంగా సాగుతోంది. అరిగిపోయిన రాళ్లను ఉపయోగించి వ్యాపారులు మోసానికి పాల్పడడంతో వినియోగదారులు నిత్యం నష్టపోతున్నారు. ఎలక్ట్రికల్ కాటాలతో సైతం వ్యాపారులు అక్రమాలకు తెరతీస్తున్నారు. ముందుగా వందగ్రాములు తగ్గించి జీరో వచ్చేలా అమర్చుతున్నారు. కొన్ని దుకాణాల్లో కాటాపై ఉన్న పళ్లెం బరువును లెక్కించకుండా తూకంలో కలిపేసి మోసాలకు పాల్పడుతున్నారు. కేజీకి 50గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు అధికశాతం దుకాణాల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. కొద్దిరోజుల కిందట తూనికలు, కొలతల శాఖాధికారులు మండలంలో నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకున్నారు. తనిఖీలు చేసిన ప్రతిచోటా వ్యత్యాసం ఉండడంతో ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు.

కండలేరులో 6.303 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి కండలేరు జలాశయానికి 80 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలు



పూతలపట్టు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 1993- 94లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హైస్కూల్ ఆవరణలోని సరస్వతి విగ్రహానికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 30 ఏళ్ల తర్వాత విద్యార్థులు మళ్లీ కలుసుకోవడంతో వాళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రతి ఒక్కరూ తమ అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకున్నారు. గతంలో గురువులు నేర్పిన విద్యాబుద్ధులు విద్యార్థులు పలు విధాలుగా గుర్తుకు తెచ్చుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం రెడ్డి, శివశంకర్ రెడ్డి, రామలింగారెడ్డి, మదన్మోహన్, శాంత కుమారి, అచ్చమ్మ పాల్గొన్నారు.

వర్షాకాలం.. జరభద్రం!

- అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఐరాల: వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం సీజనల్ వ్యాధులు ఈ కాలంలో అధికంగా సోకుతుంటాయి. వర్షాకాలంలో వాతవరణం మార్పుల వల్ల, అపరిశుభ్రత వల్ల కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధి, ఫైలేరియా వ్యాధులు ప్రబలే అవకాశముంది. అలాగే నీటి కలుషితం వల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ కామెర్లు, తదితర వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న నీళ్లలో దోమ గుడ్లు పెడుతుంది. దోమలు గుడ్లు పెట్టకుండా ఉండేందుకు ఇంటి పరిసరాల్లో నీళ్ల నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమ లార్వాలు వృద్ధి చెందకుండా పాత టైర్లలో, కూలర్లు, వాడిపారవేసిన టైర్లు, కుండలు, చిన్న చిన్న పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కాలువలు, గుంతల్లో వేస్ట్ ఆయిల్, దోమల నివారణ మందు చల్లాలి. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఆశా వర్కర్లు, సచివాలయ ఏఎన్ఎంలతో పాటు మండల వైద్యారోగ్య శాఖ అధికారులు, మలేరియా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నీటి నిల్వ ఉండే నీటి డ్రమ్ములు, తొట్లు, గచ్చుల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి, శుభ్రపరుస్తున్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికుడు(ఫైల్)

దోమ నివారణకు ప్రత్యేక చర్యలు

దోమల నివారణకు దోమ తెరలను వాడటం, ఇంటికి కిటీకీలకు, డోర్లకు, లెట్రిన్ ఔట్‌లెట్ పైపులకు జాలి వేసుకోవాలి. ఇంట్లో సాయంత్రం పూట వేపాకు పొగ బెట్టడం, శరీరం, చేతులు, కాళ్లు కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. కాచి వడపోసిన శుభ్రమైన నీరు తాగాలి. జంక్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంట్లోనే ఆహారం చేసుకుని వేడివేడిగా తినాలని వైద్యులు సూచిస్తున్నారు. పడుకునే సమయంలో దోమతెరలు వాడాలి.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> వాతవరణంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ డ్రమ్ముల్లో, గచ్చుల్లో, తొట్టల్లో నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.
>
> –ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల